**International Journal of Academic Research**
P-ISSN: 2348-7666: Impact Factor: 7.215
Homepage: https://www.ijar.org.in/
Volume-13, Issue-2(2), Apr-Jun-2026
This work is licensed under a Creative Commons Attribution 4.0 International License [CC BY 4.0]

# సాహిత్యం సంస్కృతికి వారధి - సారధి

**డాక్టర్ ఆతుకూరి వేంకటేశ్వర్లు (యోగి)**

తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ కళాశాల (అటానమస్), రాజమహేంద్రవరం. తూ.గో.జిల్లా.

**వ్యాస సంగ్రహం:**

సాహిత్యానికి సంస్కృతికి అవినాభావ సంబంధం ఉంది. ఒక దాని ప్రభావం మరొక దాని మీద ఉంటుంది. మంచి సాహిత్యం సమాజాన్ని ఆలోచింపచేస్తుంది. ఆదర్శ మార్గంలో నడిచేటట్లు చేస్తుంది. ఉత్తమ సంస్కృతిని సృష్టించడంలో సాహిత్యానిది కీలకమైన బాధ్యత. సమాజ ప్రభావం సాహిత్యం మీద కూడా ఉంటుంది. ఆయా కాలాలలో వచ్చిన సాహిత్యం సమకాలీన సామాజిక జీవితానికి దర్పణంలా ఉంటుంది. సమాజానికి సాహిత్యానికి ఉన్న అవినాభావ సంబంధాన్ని తెలియచేయటమే ఈ వ్యాసం యొక్క ఉద్దేశం.

**కీలక పదాలు**: సాహిత్యం, సంస్కృతి, ప్రభావం, వారధి, సారధి, ఆదర్శాలు, అభ్యుదయం.

1. **పరిచయం** :

సాహిత్యం అనేది కేవలం అక్షరాల కూర్పు కాదు. అది ఒక జాతి జీవన విధానానికి ప్రతిబింబం. "సాహిత్యం సంస్కృతికి వారధి - సారధి " అనే మాట అక్షర సత్యం. సంస్కృతి అంటే ఒక సమాజం యొక్క ఆచార వ్యవహారాలు, నమ్మకాలు, కళలు, విలువలు. ఈ సాంస్కృతిక సంపాదనంతటినీ ఒక తరం నుండి, మరొక తరానికి చేరవేసే వంతెన అంటే వారధి సాహిత్యం. అంతేకాదు, ఆ సమాజాన్ని సరైన మార్గంలో నడిపించే మార్గదర్శి అంటే సారధి కూడా సాహిత్యమే.

2. **సాహిత్యం - సంస్కృతి అనుబంధం** :

"స హితస్య భావః సాహిత్యం" అంటే, హితంతో కూడినది సాహిత్యం అని అర్థం. ఒక దేశం లేదా ఒక జాతి గొప్పతనాన్ని, వారు కట్టుకొన్న కోటల్లోనో, వారు సంపాదించిన సంపదలోనో ఉండదు. వారు సృష్టించుకున్న సాహిత్యంలో ఉంటుంది. సంస్కృతి అనేది ఒక ప్రవాహం ఐతే, దానికి గట్లు వేసి, అది దిశ తప్పకుండా చూసేది సాహిత్యం.

2.1. **చారిత్రక వారసత్వం** : వేల ఏళ్ల క్రితం మన పూర్వీకులు ఎలా జీవించారు, వారి ఆలోచనలు ఎలా ఉండేవి, అనే విషయాలు మనకు పురాణాలు, ఇతిహాసాల ద్వారా తెలుస్తుంది. రామాయణ మహా భారతాలు కేవలం కథలు కావు. అవి మన భారతీయ సంస్కృతికి వెన్నెముక వంటివి.

2.2. **భాషా పరిరక్షణ** : సంస్కృతికి ప్రాణం భాష. సాహిత్యం ద్వారానే భాష సజీవంగా ఉంటుంది. 11వ శతాబ్దానికి చెందిన నన్నయ్య కవిత్వం మాకు అర్థమౌతుంది అంటే, అది సాహిత్యం నిర్మించిన వారధి వల్లనే.

2.3. **విలువల బదిలీ** : తరతరాలుగా వచ్చే కట్టుబాట్లు, మర్యాదలు కథల రూపంలోనో, పద్యాల రూపంలోనో మన వరకు చేరతాయి. సత్యం వద, ధర్మం చర వంటి సూక్తులు సాహిత్యమే వంతెనపై ప్రయాణించి మన వరకు వచ్చాయి.

3. **సంస్కృతికి సారధిగా సాహిత్యం** :

సారధి అంటే రథాన్ని నడిపించేవాడు లేదా మార్గదర్శి అని అర్థం. సాహిత్యం సమాజాన్ని ప్రతిబింబించటమే కాకుండా, సమాజాన్ని సన్మార్గంలో నడిపిస్తుంది కూడా. అందుకే సమాజానికి, సంస్కృతికి సారధి సాహిత్యం. సాహిత్యం పోషించే అనేక పాత్రలను విశ్లేషిద్దాం.

3.1. **సామాజిక సంస్కరణ** : సమాజంలో మూఢాచారాలు, దురాచారాలు పెరిగినప్పుడు సాహిత్యం ఒక సారధిగా మారి ప్రజలను చైతన్య పరుస్తుంది. కందుకూరి వీరేశలింగం గారి రచనలు, గురజాడ అప్పారావు గారి కన్యాశుల్కం నాటకం వంటివి సమాజంలో ఉన్న అనేక దురాచారాలను నిర్మూలించాయి. ఆధునికమైన జీవన విధానానికి పునాదులను వేశాయి.

3.2. **జాతీయతా స్ఫూర్తి** : స్వాతంత్ర్య పోరాట సమయంలో గరిమెళ్ళ సత్యనారాయణ గారు రచించిన "మాకొద్దీ తెల్లదొరతనము" అనే పాట దేశభక్తిని ప్రజలలో రేకెత్తించింది. ఒక ఉద్యమానికి సాహిత్యం ఇచ్చిన స్ఫూర్తి ఎంత గొప్పగా ఉంటుందో దీనిని బట్టి తెలుస్తుంది.

3.3. **నైతిక దిశా నిర్దేశం** : వేమన శతకం, సుమతీ శతకం వంటి నీతి శతకాలు మనిషి ఎలా బ్రతకాలో నేర్పిస్తాయి. సమాజం దారి తప్పుతున్నప్పుడు కవులు తమ కాలం ద్వారా సమాజాన్ని హెచ్చరిస్తారు.

4. **సమాజం పై తెలుగు సాహిత్యం ప్రభావం** :

తెలుగు సాహిత్యం ఎప్పటికపుడు సమాజాన్ని ప్రభావితం చేస్తూనే ఉంది. 12 వ శతాబ్దంలో శివ కవులు గొప్ప విప్లవాన్ని తీసుకొని వచ్చారు. భక్తి విప్లవాన్ని తెచ్చి కులానికి అతీతంగా భక్తుణ్ణి కేంద్రంగా చేసుకొని, సామాజిక సామరస్యతకు మార్గం వేశారు. 13 వ శతాబ్దంలోని తిక్కన హరిహరాద్వైతాన్ని ప్రచారం చేసి, శైవ వైష్ణవ మత భేదాలు సమసిపోయేటట్లు చేశారు. ఆధునిక కాలంలో కందుకూరి, గురజాడ, శ్రీశ్రీ వంటి అభ్యుదయ కవులు సమాజ చైతన్యానికి ఊతం ఇచ్చారు.

విశ్వనాథ సత్యనారాయణ గారు విదేశీ సంస్కృతి వలన కలుగుతున్న నష్టాన్ని ప్రజలు గ్రహించేటట్లు రచనలు చేశారు. వారి వేయిపడగలు నవల సనాతన సంస్కృతీ వైభవానికి ప్రతీకగా నిలుస్తుంది. చలం మైదానం నవల ప్రభావం ఎంత గాఢంగా ఉందో చెప్పలేం. చలం భావజాలంలో కొట్టుకుపోతున్న యువతను ఆలోచింపచేసినవాడు విశ్వనాథ.

**International Journal of Academic Research**
P-ISSN: 2348-7666: Impact Factor: 7.215
Homepage: https://www.ijar.org.in/
Volume-13, Issue-2(2), Apr-Jun-2026
This work is licensed under a Creative Commons Attribution 4.0 International License [CC BY 4.0]

ఈ కాలంలో కూడా మంచి గేయాలు సమాజాన్ని ఆలోచింపచేస్తున్నాయి. చంద్రబోస్ రాసిన “మౌనంగానే ఎదగమని మొక్క నీకు చెపుతుంది, ఎదేగేకొద్దీ ఒదగమని అర్థమందులో ఉంది” పాట సమాజం మీద ఎంత ప్రభావాన్ని వేసిందో గమనించవచ్చును. నాటి నుండి నేటివరకు తెలుగుసాహిత్య ప్రభావం సమాజం మీద కనిపిస్తూనే ఉంది.

4.1. **తెలుగు సాహిత్యం - ఆంధ్ర సంస్కృతి** : తెలుగు వారి ఆచార వ్యవహారాలు, పండుగలు, తిండి తిప్పలు, కట్టుబాట్లు అన్నీ మన సాహిత్యంలో నిక్షిప్తమై ఉన్నాయి. తెలుగు సాహిత్యం కేవలం ఒక పురాణ అనువాదం కాదు. అది తెలుగు జీతీయతకు అద్దం పట్టే మాధ్యమం.

పాల్కురికి సోమనాథుని ‘పండితారాధ్య చరిత్ర’లో నాటి కాలపు తెలుగు వారి వేషభాషలు, వినోదాలు కనిపిస్తాయి. శ్రీనాథుని “కాశీఖండం” “భీమఖండం” వంటి కావ్యాలలో ఆంధ్రుల భోజన ప్రియత్వం, పల్నాటి సీమలోని పౌరుషం అద్భుతంగా వర్ణించబడ్డాయి. మన సంస్కృతిలోని మాధుర్యం సాహిత్యం ద్వారానే ప్రపంచానికి తెలిసింది.

4.2. **తెలుగు సాహిత్యం - పండుగలు, పద్ధతులు** : సంక్రాంతి సంబరాలు, ఉగాది పచ్చడిలో షడ్రుచులు, దసరా వైభవం వంటివి మన సాహిత్యంలో ఆధునిక కవిత్వంలో సజీవంగా ఉన్నాయి. ముత్యాల ముగ్గులు, గొబ్బెమ్మలు, హరిదాసు కీర్తనలు ఇవన్నీ సాహిత్యంలో ప్రతిఫలిస్తాయి.

జానపద సాహిత్యం సంస్కృతికి వెన్నెముక వంటివి. శ్రామిక గీతాలలో వ్యవసాయ సంస్కృతి తెలుస్తుంది. పెళ్లిపాటలు, జోలపాటలు, మంగళహారతులలోను మన కుటుంబ వ్యవస్థలోని అనురాగాన్ని చాటుతాయి.

4.3. **సామాజిక విలువలకు సారధి వేమన పద్యాలు**: వేమన పద్యాలు తెలుగు సంస్కృతిలో భాగమై నైతిక విలువలకు నిలువుటద్దాల వలె నిలుస్తాయి. మూఢ నమ్మకాలను ఆయన తన ఆటవెలది పద్యాలతో ఎండగట్టారు. “ అల్పుడెప్పుడు పల్కు నాడంబరముగాను సజ్జనుండు పల్కు చల్లగాను

కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా.....” అంటూ సమాజాన్ని ప్రశ్నించారు వేమన.

5. **కళలు - సాహిత్యం - సంస్కృతి పరస్పర ప్రభావం** :

సంస్కృతిలో భాగమైన సంగీతం, నాట్యం, శిల్పకళలకు సాహిత్యమే మూలాధారం. ఒక త్యాగయ్య కీర్తన లేకపోతే కర్ణాటక సంగీతానికి అర్థం లేదు. ఒక క్షేత్రయ్య పదాలు లేకపోతే కూచిపూడి నృత్యానికి భావం లేదు. అంటే ప్రతి లలిత కళకు సాహిత్యం వెన్నెముకగా నిలిచి ఆ సంస్కృతిని కాపాడుతుంది.

సాహిత్యం క్షీణిస్తే ఆ జాతి సంస్కృతి కూడా అంతరిస్తుంది. ప్రాచీన కావ్యానుశీలనం ద్వారా మన మూలాలను వెతుక్కోగలం. సాహిత్య రక్షణే సంస్కృతి రక్షణ. మాతృభాషలో సాహిత్యం సృష్టింపబడినప్పుడే ఆ సంస్కృతి సజీవంగా ఉంటుంది. సాహిత్యాన్ని భవిష్యత్ తరాలకు అందించటంలో గ్రంథాలయాలు, డిజిటల్ ఆర్కైవ్స్ కీలక పాత్ర పోషిస్తాయి.

6. **సాహిత్య ప్రక్రియలు - సంస్కృతిపై వాటి ప్రభావం :**

తెలుగు సాహిత్యం అనేక రూపాల్లో అంటే ప్రక్రియల్లో విస్తరించింది. ప్రతి ప్రక్రియ ఒక ప్రత్యేకమైన సాంస్కృతిక కోణాన్ని ఆవిష్కరిస్తుంది.

6.1. **ఇతిహాసాలు - పురాణాలు:** నన్నయ, తిక్కన, ఎర్రన రచించిన మహాభారతం, పోతన రచించిన భాగవతం కేవలం గ్రంథాలు కావు. అవి తెలుగువారి జీవన విధానానికి పునాదులు. ధర్మ, అర్థ, కామ, మోక్షాలనే చతుర్విధ పురుషార్థాలను సామాన్యులకు అర్థమయ్యే రీతిలో చెప్పాయి. ఈనాటికి మన పల్లెలో జరిగే భారత, భాగవత పఠనాలు, హరికథలు మన ఆధ్యాత్మిక సంస్కృతిని కాపాడుతున్న వారధులు.

6.2. **ప్రబంధ సాహిత్యం:** శ్రీకృష్ణ దేవరాయల కాలంలో వెలివిరిసిన ప్రబంధ సాహిత్యం మనుచరిత్ర, వసుచరిత్ర వంటివి తెలుగు వారి వైభవాన్ని చాటాయి/ ఆ కాలపు శృంగార సౌందర్య స్పృహను, రాజసాన్ని, జీవన శైలిని, ఆశ్రధారణను ఈ కావ్యాలు వర్ణించాయి. తెలుగు భాషకు ఒక గంభీరమైన రూపాన్ని, సంస్కృతిని ఇవి అందించాయి.

6.3. **పద కవిత్వం - కీర్తనలు :** త్యాగయ్య, క్షేత్రయ్య వంటి వాగ్గేయ కారులు సంగీత సాహిత్యాలను జోడించి అద్భుతమైన సంస్కృతిని సృష్టించారు. భక్తి మార్గంలో సామాన్యులను నడిపించటమే కాక, మన శాస్త్రీయ సంగీతానికి ప్రపంచ స్థాయి గుర్తింపును తెచ్చారు. అన్నమయ్య కీర్తనలలో తిరుమల వైభవం, వేంకటేశ్వరునిపై ఉన్న అచంచల విశ్వాసం ప్రతిబింబిస్తాయి.

7. **ఆధునిక కాలంలో ఎదురవుతున్న సవాళ్లు:**

సంస్కృతికి వారధి ఐన సాహిత్యం నేటి యాంత్రిక జీవనంలో, పాశ్చాత్య సంస్కృతి ప్రభావంతో వెనుకబడుతుంది. ప్రజలలో పఠనాసక్తి తగ్గటం వలన సాహిత్య వారధి బలహీనపడుతున్నది.

**డిజిటల్ విప్లవం** : పుస్తకానికి బదులు సెల్ ఫోన్ వచ్చింది. కానీ ఇక్కడే మనం సాహిత్యాన్ని డిజిటల్ రూపంలోకి మార్చి మన సంస్కృతిని కాపాడుకోవాలి.

**యువత పాత్ర** : సంస్కృతిని కాపాడటం అంటే పతకాలంలోకి వెళ్లడం కాదు. పాతలోని విలువలను కొత్త కాలానికి అన్వయించటం. దీనికి సాహిత్యానికి మించిన ఆయుధం లేదు.

**ముగింపు** :

సాహిత్యం లేని సంస్కృతికి పునాది ఉండదు. సంస్కృతి లేని సాహిత్యానికి జీవం ఉండదు. మన సంస్కృతి ఒక మహా వృక్షం అయితే, సాహిత్యం దానికి పర్ నీరు లాంటిది. మన అస్థిత్వాన్ని కాపాడుకోవాలన్నా, మన పిల్లలకు మన గొప్పతనాన్ని అందించాలన్న సాహిత్యాన్ని ఆదరించాలి.

" **జాతి గర్వించదగ్గ సాహిత్యం ఏ దేశంలో ఉంటుందో, ఆ దేశ సంస్కృతి అజేయంగా నిలుస్తుంది.**"

**ఆధార గ్రంథాలు :**

1. ఆరుద్ర. సమగ్ర ఆంధ్ర సాహిత్యం. ప్రజాశక్తి బుక్ హౌస్, హైదరాబాద్, 1965.
2. నాగయ్య, జి. తెలుగు సాహిత్య సమీక్ష. నవ్య సాహితీ సమితి, తిరుపతి, 1985.
3. రాధా కృష్ణన్, ఎస్. మన సంస్కృతి(అనువాదం), నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా, 1950
4. రామరాజు, బిరుదురాజు. తెలుగు జానపద గేయసాహిత్యం. తెలుగు అకాడమీ, హైదరాబాద్, 1958
5. వేంకటావధాని, దివాకర్ల. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర. ఆంధ్ర సారస్వత పరిషత్, హైదరాబాద్, 1958